# శయనేషు రంభ

## కాలువ మల్లయ్య

**కార్యేషు దాసీ.. కరణేషు మంత్రీ ... భోజ్యేషు మాతా.. ఈవిషయంలో రాణి తనకు తనే సాటి. క్షమయా ధరిత్రి ఓర్పులో భూదేవిని మించినదామె. కాని... కాని శయనేషు రంభా ఈవిషయంలోనే తనను సంతృప్తి పరచడం లేదు**

రాణి తెలివి తక్కువదేం కాదు. శృంగార మంటే పాపకార్యమని భావించే అమాయకురాలూ కాదు. డిగ్రీ వరకు చదువుకుంది. అందం.. ఆరోగ్యం సమపాళ్లలో ఉన్నాయామెకు.

అయినా ఆమెందుకు తనకు సుఖాన్నివ్వలేకపోతుంది..!



కుర్చీలో కూర్చుని రాణి గూర్చి ఆలోచిస్తున్న రాజేంద్ర కళ్ల ముందు ఆమె ముగ్ధ మోహన సౌందర్యరూపమే కదిలింది.

బంగారు వన్నె, మేనిఛాయ.. చెంపకు చారడేసి కళ్లు.. ఆకర్షణీయమైన ముఖం. నిండైన వక్ష సంపద, ఆమెను చూస్తేనే పెళ్లి కొప్పుకున్నాడు రాజేంద్ర. కట్నంగా వాళ్లిచ్చిందే తీసుకున్నాడు. తన నిర్ణయం సరైందే అనుకున్నాడు.

ఏవిషయంలోనూ భర్తకు లోటు చేయని రాణి పడకగదిలో మాత్రం ముభావంగా ఉంటుంది. తనకే మాత్రం ఇష్టం లేనట్టు యాంత్రికంగా పాల్గొంటుంది. ముభావంగా ఉంటుంది. ఆమె శరీరం మీద చెయ్యేస్తేనే మంచు గడ్డను తాకినట్టు అవుతుంది రాజేంద్రకు.. ఆవిషయం లో ఏమాత్రం ఆసక్తి చూపని రాణి ప్రవర్తనపై అసంతృప్తిగా ఉంది రాజేంద్రకు.

'రాణిలా ఎందుకు చేస్తుంది ..? తనంటే ఇష్టం లేదా..? డిగ్రీ చేస్తున్న సమయంలో ఎవరినైనా ప్రేమించిందా..? రాజేంద్ర అనుమాన మొక్కటీ నిజం కాదని తేలింది.

'సౌందర్యాన్నంతా ఒక్క చోట కుప్ప బోస్తే అది రాశి అవుతుంది. అలాంటి రాణి తనకెందుకు సుఖాన్విలేకపోతుంది...? పడక గదిలో రాణిని తను రంభలా చూడాలనుకున్నాడు. .' ఓరోజు అదే విషయం రాణి తో చెప్పాడు.

'నేను పడకగదిలో రంభలా ఉండాలి అంతే కదా మీరు కోరుకునేది?'

అవును...నాభార్యతో నేను సుఖాలనుభవించాలనుకోవడం తప్పా...?' 'కానే కాదు..కాని రంభెవరు..?'

రాణి ప్రశ్నకు చికాకు పడ్డాడు రాజేంద్ర.

'నువ్వేదో తెలివిగా మాట్లాడుతున్నాననుకోకు ..రంభెవరో నీకు తెలియదా..?'అన్నాడు.

' ఓహో ..పురాణాల్లోని రంభ గూరించా మీరు చెప్పేది. ఆమె దేవవేశ్య కదా?వేల సంవత్సరాల నుండీ అలాగే ఉంటుంది. అంటే ముసలివేశ్యన్నమాట. మరి నన్ను ముసలివేశ్యలా ఉండమంటారా?'

ఆమె మాటల్లోని వ్యంగ్యంతో రాజేంద్రకు కోపమొచ్చింది..భర్తను చూస్తూ లోలోన నవ్వుకుంటుంది రాణి.

'అన్నిటికీ పెడర్థాలు తీయకు. రంభలా ఉండమంటే వేశ్యలా ఉండమని కాదు. ఆకర్షణీయంగా,భర్తకు సుఖాలనిచ్చే విధంగా ఉండాలి.'

'అలాగే ..?అంటే స్త్రీ భర్తకు సుఖాలనిచ్చే విధంగా ఉంటేచాలు. అంతేనా.?నేను రంభలా ఉంటే మీరు నలకుబేరుడిలా ఉండకూడదా మరి..?మీరలా ఉంటున్నారా? మీరు ఒడ్డోడుతూ ఉన్నా పర్వాలేదు కానీ నేం మాత్రం రంభల్లా ఉండాలంటే ఎలాగండీ.?

రాణి మాటలు విన్న రాజేంద్రకు నోరు మూతపడింది..కొద్ది క్షణాలేం మాట్లాడలేదు. 'మగవాళ్ల సంగతి వేరు ..మాకేం అలంకారాలుంటాయి..?అన్నాడు కొంచెం కొంటెగా.'అలంకరణలన్నీ స్త్రీలవే నంటారు..మరి మీరు రంభను చూశారా ?సినిమాల్లో చూసే ఉంటారు.నాకు తెలిసినంత వరకు రంభ ఒంటి నిండా నగలతో,పట్టుచీరలతో ఉంటుంది. మరి నాకవన్నీ కొనిపెట్ట గలరా..?

'రాణీ!నువ్వే తెలివిగా మాట్లాడుతున్నాననుకోకు. రంభ అనే భావాన్నర్థం చేసుకోవాలి కానీ ప్రతిదానికీ వేరే అర్థాలు తీయడం కాదు..'

అని కోపంగా వెళ్లిపోయాడు రాజేంద్ర.

రెండు మూడు రోజులు ముభావంగా ఉన్నాడు. భార్యకు దూరంగా కూడా వున్నాడు.కానీ అతని వయసు,అవసరం ఆమెను దగ్గరకు తీసుకునేట్టు చేశాయి. రాణి ప్రవర్తనలో మాత్రంలో మార్పు లేదు. రాజేంద్రకున్న అసంతృప్తి అలాగే ఉంది.

మరో రోజు భార్యను దగ్గర కూచోబెట్టుకుని అన్నాడు.

'రాణీ !మనకు సుఖపడే అన్ని



అవకాశాలుండి కూడా సుఖపడటం లేదు. మనకున్న యవ్వన కాలం మొత్తం జీవితంతో పోలిస్తే తక్కువే. ఈకాలంలోనైనా మనం తృప్తిగా సుఖాలనుభవించ వచ్చు కదా..! నాకైతే నీ అందాన్ని అడవి గాచిన వెన్నెల చేసుకుంటున్నావనిపించింది.'

'ఏం మనమిప్పుడు సుఖపడటం లేదా..? బెడ్‌రూమ్‌లో నేను రంభలా ప్రవర్తిస్తేనే మనం సుఖపడినట్టా.?' భర్తను ఉడికించాలని అంది రాణి.

'రాణీ దయచేసి వితండ వాదం చేయకు. పొద్దంతాపనిచేసి సాయంత్రం ఇంటి కొచ్చే సరికి భార్య నవ్వుతూ అందంగా కనబడితే అతని సగం అలసట మరిచిపోతాడు. రాత్రి సుఖం అతన్ని మరింత ఉత్తేజితుడ్ని చేస్తుంది.'

'అది సరే కాని అలసట అనేది ఆడవాళ్ల కుండకూడదా...? మరి మా అలసట గూర్చి మీరెపుడైనా ఆలోచించారా.? మా శారీరక మానసిక స్థితి ఎలా వున్నా మీ వేడైతే చల్లారాలి. మీ కోర్కె గురించే ఆలోచిస్తారు కానీ ఎదుటి వాళ్ల స్థితిని గూర్చి మీరెందుకు కాలోచించరు..? పోగా మాకు కోర్కె వున్నా మేం వ్యక్తం చేయగలమా..? చేస్తే ఆ స్త్రీ బరితెగించిందన్నట్లేగా మీ దృష్టిలో ఆడవాళ్ళు చొరవ తీసుకుంటే ప్రళయం వచ్చినట్లే భావిస్తారు కదా మీరు. మరలాంటపుడు మీ కోర్కెలే మా కోర్కెలెలా అవుతాయి..?'

భార్యలో ఇంత తార్కికత, విచక్షణా జ్ఞానం ఉన్నాయని ఊహించని రాజేంద్ర ఆమాటలకు అవాక్కయ్యాడు. ఆ మాటల్లో ఎంతో లోతున్నట్టు గ్రహించాడు. అప్పుడేం మాట్లాడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

రాణి మాటల గూర్చే ఆలోచిస్తున్నాడు రాజేంద్ర. ఆమెను తనకనుగుణంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. క్లబ్బుకు తీసుకువెళ్లాడు. మిత్రులతో పరిచయం చేశాడు. మరెన్నో రకాలుగా ప్రయత్నించినా ఆ విషయంలో ఆమె లో పెద్దగా మార్పు వచ్చినట్టు కనిపించడం లేదు.

ఓరోజామెతో అదే మాటన్నాడు.

'మీ గురించి కాదు గాని జెనరల్ విషయం చెబుతున్నాను. మీరు అంటే మగాళ్ళు మమ్మల్ని క్లబ్బుల వెంట తిప్పినా మాడర్న్ భ్రమల్లో ఉంచినా అవన్నీ మీ అవసరాలు తీరడానికే. మీరు కోరుకున్నట్టు బతకడానికే. మీరు కోరుకున్నంత వరకైతే మేం మంచి భార్యలవుతాం. మీరనుకున్న పరిధిని ఏం కొంచెం దాటి స్వతంత్రంగా ప్రవర్తించినా మీ అహం దెబ్బ తింటుంది. కాదంటారా?' అంది రాణి

'రాణీ నేను చెప్పేదొకటైతే నువ్వు చెప్పేది మరొకటవుతుంది. జీవితాన్ని సుఖమయం చేసుకోవడానికి మన పూర్వులు కొన్ని విషయాలు శ్లోకాల ద్వారా చెప్పారు అందులో శయనేషు రంభా అనేదొకటి..నాకైతే ఈ శ్లోకమెంతో ఇష్టం. ఇందులో తప్పేముందో నాకర్థం కావడం లేదు.'

భర్త మాటలు విని నవ్వింది రాణి. అంతలోనే ఆమె ముఖం సీరియస్‌గా మారింది.

'పురుషాధిపత్యాన్ని నరనరాన జీర్ణించుకున్న వాళ్లకా శ్లోకం నచ్చడంలో వింతేం లేదు..పూర్వులు చెప్పిన విషయాలు తప్పో ఒప్పో అనే చర్చా ఇప్పుడవసరం లేదు. ఆయా కాలపరిస్థితుల ననుసరించి చెప్పబడిన కొన్ని విషయాలు ఎప్పటికీ నిత్యనూతనాలనుకోవడం పొరపాటు. అందులో కొన్ని వర్గాల ప్రయోజనాలూ ఉండొచ్చు. మనువు, పరాశరుడు, వాత్స్యాయనుడు చెప్పిన విషయా లన్నీ సార్వకాలీనమైనవని భావించ నక్కర లేదు. మిగతా విషయాల సంగతేమో కానీ వాళ్ళు చెప్పిన విషయాల్లో స్త్రీ మాత్రం భోగవస్తువే. ఆమెకంటూ ఓవ్యక్తిత్వముంటుందని వాళ్ళు భావించినట్టు కనబడదు. పురుషునికి సుఖాలనివ్వడం తప్ప ఆమె కింకో పనే లేదా..?అంది'

స్వతాహాగా మంచి వాడైన రాజేంద్ర భార్యమాటనర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఆమె ఏం చెప్పదలుచుకున్నదో అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఆమె మాటల గూర్చి తీవ్రంగా ఆలోచించాడు.

ఇప్పుడతనికి ఆమె మాటలు తప్పుగా కనబడకున్నా పడక గదిలో ఆమె ఎలా ఉండాలో తాను కోరుకోవడంలో తప్పు కనబడటం లేదాతనికి.

మరి కొద్దిరోజులు గడిచాయి.

'రాణీ నీకెలా చెప్పాలో నాకర్థం కావడం లేదు. నీ మాటలు తప్పనీ నేననడం లేదు. కానీ నేను కోరుకున్నది తప్పనో, అత్యాశనో నాకనిపించడం లేదు' అని భార్యను దగ్గరకు తీసుకుని అన్నాడు రాజేంద్ర..

'మీరు కోరుతున్నది తప్పూ కాదు. అత్యాశా కాదు. కాని మీరొక్క విషయం గమనించాలి. స్త్రీకి ఒంపుసొంపులతో కూడుకున్న శరీరంతో పాటు మనసూ ఉంటుందని తెలుసుకోవాలి. కొన్ని ఆలోచనలూ ఉంటాయని గ్రహించాలి. మీకు లాగే స్త్రీకీ శారరక సుఖాలనుభవించాలనుంటుంది. భార్యాభర్తలిద్దరూ ఒకర్నొకరర్థం చేసుకోవాలి. ఆవిషయంలో కూడా సమానంగా పాల్గొనాలి. కాని దురదృష్టవశాత్తూ స్త్రీ ఆ మాట నుచ్చరిస్తేనే పాపం. అదే పురుషుడు మాట్లాడితే మగతనం. ఇలాగే ప్రతి విషయంలోనూ పురుషాధిక్యతే ఉన్నపుడు స్త్రీకి ఆ సుఖంలో మాత్రం పురుషుడికిలా ఆసక్తి ఎలా ఉంటుంది...? శారీరక సుఖమె యినా ఏదయినా ఇద్దరికీ సమానంగా సుఖాన్నిచ్చేదయినపుడే సుఖమవుతుంది.'

భార్యలో ఒక సామాజిక విశ్లేషణ కారిణిని చూస్తున్నాడు రాజేంద్ర.

'రాణీ నువ్వు చాలా తెలివిగలదానివి నీ మాటల్లో ఎంతో అర్థముంది. ఇన్నీ తెలిసీ నువ్వు నాకా విషయంలో సుఖాన్నెందు కివ్వలేక పోతున్నావు..? నేను నా భార్యతో అన్ని విధాలా సుఖాలనుభవించాలనుకోవడం నేరమా..?' అన్నాడు.

'అని ఎవరన్నారు. కాని మీ ప్రశ్నలోనే మీ నా అనే పాశిక దృష్టి అగుపడుతుంది. శృంగారమనేది స్త్రీపురుషులిద్దరికీ కావాలి..దాని వల్ల వచ్చే సుఖం ఇద్దరికీ చెందాలి. అది భర్తనే వాడు తన 'కుతి' తీర్చుకుంటానికి మాత్రమే అయితే అది సుఖం కాదు. శృంగారం

శారీరకావసరం మాత్రమే కాదు. అది మానసికమైంది కూడా.. భార్యాభర్తలిద్దరూ మానసికంగా దగ్గరకై ఒకరికొకరన్నట్టు ప్రవర్తించినప్పుడే అందులో సంపూర్ణ సుఖం లభిస్తుంది. అప్పుడే ఒకరిలో ఒకరు లీనమైపోతారు. అలా కాక ఎదుటి వాళ్ళ మానసిక స్థితి నర్థం చేసుకోకుండా అందులో పాల్గొంటే అది శృంగారం కాదు. వ్యభిచారమవుతుంది. ఇప్పుడు చాలా సంసారాల్లో జరిగేది అదే.'

రాణి మాటల్లో నగ్నసత్యాలు స్ఫురింపిస్తుంది రాజేంద్రకు.

'నిజమే రాణీ! ఇంతకీ నన్నేం చేయ్యమంటావో చెప్పు..? నాకు మాత్రం నీ నుంచి సంపూర్ణ సహకారం కావాలి' అన్నాడు అనునయంగా!

'స్త్రీ కంటే తాను గొప్పవాడినన్న భావం పోవాలి. చాలామంది పురుషులు భార్యలను నువ్వనో, రావే, పోవే అనో పిలుస్తారు. భార్యలు భర్తలను మాత్రం మీరనే పిలవాలి. భర్త ఏమే అంటే భార్య ఏమండీ అనాలి. భార్యభర్తలిద్దరూ సమానమేనన్న భావం ఇద్దరిలోనూ రావాలి. స్త్రీ శృంగారాన్ని పాప కార్యంగా భావించకూడదు. ఇద్దరి మధ్య అరమరికలుంటే కష్టమే. మీరు మంచి వారు. నన్నర్థం చేసుకునే వారు కాబట్టే ఇన్ని విషయాలు ఇంత స్వేచ్ఛగా చెప్పగలిగాను. ఇంకొకరైతే నా మాటలను వేరే విధంగా తీసుకునే ప్రమాదముంది.'

భార్యను ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు రాజేంద్ర. ఆమె చెప్పిన విషయాల గూర్చి బాగా ఆలోచించాడు. స్త్రీ పురుష సంబంధాల గురించి ఎన్నో మంచి పుస్తకాలు చదివాడు. చలం రచనలూ చదివాడు. అతనిలో జరుగుతున్న సంఘర్షణను, మథనాన్ని గమనిస్తూనే ఉంది రాణి.

★★★

కుర్చీ లోంచి లేచి కూర్చున్నాడు..

ఆరోజే రాజేంద్ర, రాణీల మొదటి మ్యారేజ్ డే. సాయంత్రం వరకైనా ఇంటికెళ్ళాలనుకున్నాడు. సామాన్లు సర్దుకున్నాడు. గబగబా బస్టాండుకు వెళ్ళాడు.

రాజేంద్ర ఇంటికి వెళ్లే సరికి రాత్రి ఏడుగంటలయింది. ఎదురుగా రాణిని చూసి తన కళ్లను తనే నమ్మలేకపోయాడు.

రాణి ఒంటమీద ఒక్క బంగారు నగా లేదు. అతి సాధారణ దుస్తుల్లో సౌందర్య రాశిలా కళ్లు మిరుమిట్లు గొలిపేట్టుగా ఉంది రాణి.

ముద్దు పెట్టుకోవాలనిపించే ముఖం. బరువైన వక్ష సంపద. నునుపైన శరీరం. మత్తెక్కిస్తూ కనబడుతున్న నాభి.

సూట్‌కేసు నేల మీదుంచి రాణిని బిగి కౌగిలిలో బంధించాడు రాజేంద్ర.

ఆ రాత్రి వాళ్లకు కంటి మీద కునుకు లేదు.

భర్తను స్వర్గలోకపు అంచుల వరకూ తీసుకెళ్లింది రాణి. స్వర్గంలో విహరింపచేసింది. ఈ ఏడాదిలో ఏ రోజూ పొందని సుఖాన్ని వాళ్ళిద్దరూ ఆ రాత్రి అనుభవించారు. సంసార సుఖంలోని అసలు సుఖాన్ని చవిచూశారు.


పిట్టల కిచకిచ ధ్వనులు కాని, పేపరు వాడొచ్చి తలుపు తట్టిన శబ్దం కాని, పాలవాడి అరుపులు కాని ఒకరి కౌగిలిలో ఒకరన్నట్టు ఒదిగిపోయిన ఆ దంపతులను విడదీయలేదు. పాలవాడు పక్కింట్లో పాలు పోసి వెళ్లిపోయాడు.

మరో గంట తరువాత కాని వాళ్లకు తెల్లవారి చాలా సేపయిందన్న ధ్యాస రాలేదు.. లేచి ఒకరి పక్కనొకరు కూర్చున్నారు., వాళ్ళిద్దరి ముఖాల్లో ఎంతో సంతృప్తి ఉంది.


'రంభ కావాలా లేక..? లేక..' అడిగింది రాణి.

'ఏ రంభైనా నీ ముందు దిగదుడుపే.' అన్నాడు రాజేంద్ర. రాత్రి అంత సుఖాన్నిచ్చిన భార్యను ప్రశ్నార్థకంగా చూశాడు. అతని భావాన్నర్థం చేసుకుంది రాణి.

'మగడు వేల్పన పాత మాటది.. ప్రాణ సఖుని తలువవలె' నన్న గురజాడ మాటలను దృష్టిలో ఉంచుకుంటే వాళ్ళ సంసారంలో సుఖాలకు కొదవే ఉండదు. స్త్రీ, పురుషుల్లో ఎవరైనా సరే అధికులమని భావించినపుడు రెండవ వాళ్ళు ముడుచుకుపోతారు. ఇద్దరూ ఒకరి కొకరన్నట్టు విలీనమైపోవాలంటే ఆ భావం పోవాలి. మీలో వచ్చిన మార్పు మీ ముఖాన్ని చూస్తేనే తెలిసింది. మీ స్పర్శ నా నమ్మకాన్ని మరింత స్పష్టం చేసింది. అందుకే మనం రాత్రి అన్ని సుఖాలు పొందగలిగాం' అంది.



# భాషలపై 'ఇంటర్‌నెట్' వేటు?



ఒక భాష అంతరిస్తున్న ప్రతీసారి మానవత్వం మసకబారుతుందని ఒక మేధావి ఉవాచ. ఇరవైయవ శతాబ్దంతో భాషలు వేగంగా అంతరిస్తున్నాయి.

ప్రపంచం మొత్తంమీద 6 నుంచి 7 వేల భాషలు మాట్లాడుతున్నారని అంచనా. అయితే పదివేల ఏళ్ళ క్రితం 15 వేల భాషలు మాట్లాడే వారట. పైగా అప్పటి జనాభా ఒక్క మిలియన్ మాత్రమే ఉండేది. వంద సంవత్సరాల్లో వాటిలో మూడవంతుల భాషలు అంతరించాయట. మిగిలిన భాషల్లో తొంభైశాతం అంతరిస్తాయని. 600 భాషలకే రక్షణ ఉందని ప్రొఫెసర్ డైటర్‌వండర్ లిచ్ అంటున్నారు.

వాస్తవమేమిటంటే భాషలు అంతరించడం అనూహ్యమైన వేగంతో జరుగుతోంది.

మైనారిటీ భాషలపై రాజకీయ, సాంస్కృతిక వత్తిడులే ప్రధాన కారణం. ఇప్పుడు కొత్తగా అవతరించిన ఇంటర్‌నెట్ భాషలను మట్టుపెట్టేదిగా మారనుందని వండర్‌లిచ్ అంటున్నారు. ఆర్థిక ప్రపంచానికి అవసరమయ్యే ఇంగ్లీషు భాషఇప్పుడం దరికి ప్రియం అయ్యింది. ఇంగ్లీషు భాషను ఇంటర్‌నెట్ ఇంకా ప్రోత్సహిస్తున్నది. ఇప్పటికే వార్తాపత్రికలు, టి.వి రేడియో, న్యూస్‌బులిటెన్లు అధికార భాషల్లోనే వస్తున్నాయి.

ఆస్ట్రేలియా ఖండంలో భాషలు వేగంగా అంతరిస్తున్నాయట. 18వ శతాబ్దం చివరికి అంటే వలసవాదం ప్రారంభమైననాటికి 250 భాషలుండేవి. ఇప్పుడవి 25కు తగ్గాయట. ఆఫ్రికాలో ఒక భాషపై మరొకటి ఆధిపత్యం చలాయిస్తాయి. వేయికిపైగా ఉన్న ఆఫ్రికా భాషల్లో 220 మాత్రమే మిగిలాయి. అవికూడా ప్రమాదంలో ఉన్నాయట. సాధారణంగా ప్రభుత్వాలకు వేర్వేరు భాషలను ఉద్ధరించాలనే ధ్యాస ఉండదు. యూరోపియన్ యూనియన్ దేశాల్లో 48 మైనారిటీ భాషల్లో 23 భాషలు నిలిచే పరిస్థితుల్లో లేవట.